# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశంలోని ఉన్న విద్యా సంస్థలు పరిశోధనలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు.
- వన్యప్రాణుల సంరక్షణకు కృత్రిమ మేధస్సును వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- పాడి పరిశ్రమ మహిళా సాధికారతకు తోడ్పాటును అందిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు.
- భారత్ - బెల్జియం దేశాలు స్థిరమైన ద్వైపాక్షిక సంబంధాలను కలిగి ఉన్నాయని విదేశాంగ శాఖా మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు.
- రక్షణ రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం ఎంతో అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

==============================

దేశంలోని విద్యాసంస్థలు ప్రపంచ ప్రమాణాలను సాధించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో 8వ విజిటర్స్ అవార్డులను ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో పరిశోధనలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఉన్నత విద్యా సంస్థలు కృత్రిమ మేధ రంగంలో నూతన శిఖరాలను అధిలోహించాలని రాష్ట్రపతి మాట్లాడుతూ…

(వాయిస్ 36 సెకన్లు)

==============================

వన్యప్రాణుల సంరక్షణకు కృత్రిమ మేధస్సును వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఈరోజు గుజరాత్ లో జునాగఢ్ లోని ససన్ గిర్‌లో జరిగిన

జాతీయ వన్యప్రాణుల బోర్డు 7వ సమావేశానికి ప్రధానమంత్రి ఈరోజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వన్యప్రాణుల నిర్వహణ కోసం కృత్రిమ మేధస్సు, జియో స్పేషియల్ మ్యాపింగ్ ఎంతో అవసరం అని అన్నారు. డాల్ఫిన్ ఆవాస ప్రాంతాలను విద్యార్థుల సందర్శనాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా దేశంలో నిర్వహించిన మొట్టమొదటి నదీతీర డాల్ఫిన్ అంచనా నివేదికను ప్రధానమంత్రి ఈ రోజు విడుదల చేశారు. అలాగే జునాగఢ్‌లోని నేషనల్ రిఫరల్ సెంటర్ ఫర్ వైల్డ్‌లైఫ్‌కు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు.

==============================

పాడి పరిశ్రమ దేశాభివృద్ధికి దోహదపడటమే కాకుండా గ్రామీణాభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. న్యూఢిల్లీలో పాడి పరిశ్రమకు సంబంధించిన ఒక కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ పోషకాహారంలో పాడి పరిశ్రమ కీలకంగా వ్యవహరిస్తుందని.. 62 శాతం మహిళలు ఈ రంగంపై ఆధారపడడంతో మహిళా సాధికారతలో ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. శ్వేత విప్లవం 2.0కి పాడి పరిశ్రమలో స్థిరత్వం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. దేశంలోని 80 శాతం జిల్లాల్లో పాడి పరిశ్రమ సంఘాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

దేశంలో మహిళల గౌరవం, భద్రతను కాపాడటానికి ప్రభుత్వం అనేక చట్టాలను సవరించిందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మహిళల చట్టాలు, సైబర్ నేరాల అవగాహనపై జరిగిన కార్యశాలలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) తో, మహిళలపై అనేక నేరాలు పెరిగాయని, దీనిని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. సైబర్ కార్యకలాపాల సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే ఫిర్యాదులను నమోదు చేయాలని కోరారు. జాతీయ మహిళా కమిషన్ నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళల కోసం సైబర్ చట్టాలను బలోపేతం చేయడానికి 200కు పైగా కీలక సంస్కరణలను చర్చించడం లక్ష్యంగా పెట్టుకుంది.

==============================

భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా ఈరోజు ఉదయం ప్రధానమంత్రి గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో ఉన్న గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అందులో భాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

విరామం

==============================

భారత్ - బెల్జియం దేశాలు స్థిరమైన ద్వైపాక్షిక సంబంధాలను కలిగి ఉన్నాయని విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో బెల్జియం ఉప ప్రధాన మంత్రి మాగ్జిమ్ ప్రీవోట్‌తో నిర్వహించిన సమావేశంలో జయశంకర్ మాట్లాడుతూ... ఇరు దేశాలు వాణిజ్యం, పరిశ్రమలు, విద్య, ఆవిష్కరణలు, సాంస్కృతిక రంగాలలో మంచి సంబంధాలను కలిగి ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు, క్లీన్ ఎనర్జీ రంగాలపై చర్చించామని జయశంకర్ మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో బెల్జియం నాయకులు సమావేశమయ్యారు. సముద్ర రంగంలో రక్షణ ఒప్పందాల అవకాశాలపై బెల్జియం యువరాణి ఆస్ట్రిడ్, ఆ దేశ రక్షణ మంత్రి థియో ఫ్రాంకెన్ రాజ్‌నాథ్ సింగ్ తో చర్చించారు.

=============================

ఆస్కార్ అవార్డుల 97వ ఎడిషన్ ఈరోజు లాస్ ఏంజిల్స్‌లో ఘనంగా ముగిసింది. దర్శకుడు సీన్ బేకర్ తెరకెక్కించిన "అనోరా" చిత్రం 5 అవార్డులను సొంతం చేసుకొని వేడుకలో అతిపెద్ద విజేతగా నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, కథనం, ఎడిటింగ్, నటి విభాగాలలో అవార్డులను గెలుచుకుంది. "ది బ్రూటలిస్ట్" చిత్రానికి గాను అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డును గెలుచుకోగా, అనోరా చిత్రానికి గాను మికీ మాడిసన్ ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది.

=============================

భారతదేశం రానున్న రెండు సంవత్సరాల్లో ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. భారతదేశ ఆర్థిక పురోగతికి ఈ రెండు రంగాల భాగస్వామ్యం గణనీయంగా దోహదపడిందని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్షణ రంగంలో ప్రైవేట్ రంగం ప్రమేయం ఎంతో అవసరమని, జాతీయ భద్రతలో స్వయం సమృద్ధిని సాధించడానికి ఇది దోహదపడుతుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్లు)

=============================

ప్రభుత్వం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC) ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) లకు నవరత్న హోదాను కల్పించింది. రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ IRFC వార్షిక టర్నోవర్ 26 వేల కోట్ల రూపాయలకు పైగా ఉండగా, IRCTC వార్షిక టర్నోవర్ 4 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంది. నవరత్న హోదాకు అప్‌గ్రేడ్ అయినందుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ IRCTC, IRFC లను అభినందించారు.

=============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 73,198 లాభాల్లో ప్రారంభమై.. చివరికి 112 పాయింట్ల నష్టంతో 73,085 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.40 పాయింట్ల నష్టపోయి 22,119 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 2 పైసలు బలపడి 87.35 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.42 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,877 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

=============================
=============================